క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. రైతు బజారును తనిఖీ చేసి నిబంధనల మేరకు విక్రయాలు సాగాలని సూచించారు. అనంతరం శానిటేషన్ పనులను, డ్రైన్స్, బ్లాకింగ్ పాయింట్స్‌లను పరిశీలించారు. అలాగే పద్మావతినగర్‌లో జరిగే పనులను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్, మున్సిపల్ ఇంజినీర్ పాల్గొన్నారు.

24 వరకు వినియోగదారుల వారోత్సవాలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 24వ తేదీ వరకు వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అమీర్‌బాషా పేర్కొన్నారు. వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం నంద్యాలలో నవభారత్ పాఠశాలలో వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నవభారత్ పాఠశాల అధినేత హుసేన్ అధ్యక్షతన జరిగింది. వినియోగదారులు తమ హక్కులు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వినియోగదారులు న్యాయపాలన, వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం అనే విషయాల మీద పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి జిల్లాకు ఒకటే వినియోగదారుల కోర్టు ఉన్నందున ప్రత్యక్షంగా కేసు వేయలేని వారికి పరోక్షంగా వర్చువల్ విధానంలో కేసులు వేసేందుకు వీలు కల్పించాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల సంఘ సభ్యులు రజినీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

చాగలమర్రి: మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై నిర్వహించిన 18వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశాన్ని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పనులు, నిధుల ఖర్చుపై ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు డీఆర్‌పీలు నిధులపై సామాజిక తనిఖీ నిర్వహించారన్నారు. అనంతరం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి నివేదిక చదివి వినిపించారని చెప్పారు. ఈ సామాజిక తనిఖీపై గురువారం ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన బహిరంగ సమావేశం ఉంటుందని ప్రకటించారు. సమావేశానికి ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కూలీలు, గ్రామ ప్రజలు హాజరు కావాలని కోరారు.

ఉరుసు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో టెక్కె ఖాద్రీసాహెబ్ దర్గా

నంద్యాల(వ్యవసాయం): టెక్కెలోని హజరత్ సయ్యద్‌షా నూర్ అలం ఖాద్రీసాహెబ్ దర్గా ఉరుసు బుధవారం సాయంత్రం గంధంతో ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి సయ్యద్ అఫీజ్ అహమ్మద్ ఖాద్రీ మాట్లాడుతూ 19వ తేదీన ఉరుసు ఉంటుందని చెప్పారు. 20న రాత్రి జియారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సయ్యద్ మోహిద్దీన్‌ఖాద్రీ, సయ్యద్ నూర్‌అలాంఖాద్రీ, సయ్యద్ మహబూబ్ అలంఖాద్రీ, సయ్యద్ చాంద్‌పీర్ ఖాద్రీ పాల్గొన్నారు.


ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారం



ఆర్టీసీ ఉద్యోగికి పురస్కారం అందజేస్తున్న డిపో మేనేజర్

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ డిపోలో నవంబర్ మాసంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని బుధవారం డిపో ఆవరణలో అభినందించారు. డిపో మేనేజర్ గంగాధర్‌రావు, మద్దిలేటినాయుడు మాట్లాడుతూ అత్యధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్లు తిరుపాలు, మల్లికార్జున, శేషన్న,రాజు డ్రైవర్ రాముడు, బాషా, ఖాన్, టీసీఆర్ స్వాములను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకం అందజేశారు. సూపరింటెండెంట్ కృష్ణమోహన్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి గణపతికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధ జలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

రబీ పైనే ఆశలు



ముకుందాపురం వద్ద ఎద్దులతో బురద సేద్యం చేస్తున్న దృశ్యం



చిత్రేనిపల్లె వద్ద వరి నాట్లు వేస్తున్న కూలీలు

రుద్రవరం: రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ కలిసి రాలేదు.పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినా దిగుబడులు చేతికందే సమయంలో కష్టాలు, నష్టాలు తప్పలేదు. వరుసగా తుపాన్లు, అల్పపీడనం తదితర విపత్తులతో కోత దశలో ఉన్న వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. వాటిని కోత కోయించడానికి అన్నదాతలు అష్ట కష్టాలు పడ్డారు. అలాగే ముందస్తుగా కోతలు కోయించి దిగుబడులను రోడ్లపై ఆరబోసుకోగా వర్షాలు కురవడంతో ధాన్యం తడిసి పోయింది. తడిసిన ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది. ఇలా ఖరీఫ్ సీజన్ నష్టాలనే మిగిల్చించింది.అయితే పట్టు సడలని రైతులు ఎన్నో ఆశలతో రబీ సీజన్ కింద మళ్లీ వరి, మొక్కజొన్న పంటల సాగు చేస్తున్నారు. ఇప్పటికే మండల కేంద్రమైన రుద్రవరం, నర్సాపురం, తిప్పారెడ్డిపల్లె, ఆలమూరు,చిన్నకంబలూరు,ఎల్లావత్తుల, డీ.కొట్టాల, శ్రీరంగాపురం,కోటకొండ తదితర గ్రామాల పరిధిలో రెండో పంటగా వరి సాగులో నిమగ్నమయ్యారు. నారుమడులు సిద్ధం చేసుకోవడం, పొలాల్లో ట్రాక్టర్లు, ఎద్దులతో బురద సేద్యం చేయించడం, నిక్కిన నారును నాటించడం వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. గతేడాది రబీ సీజన్‌లో దాదాపు 3వేల హెక్టార్లలో వరి సాగు కాగా ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి దాదాపు 5వేల ఎకరాల్లో సాగు కాగా.. మొక్కజొన్న 4వేల ఎకరాల్లో సాగైంది.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి



ప్రత్యేక అలంకరణలో విఘ్నేశ్వరస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని నాగలింగేశ్వర ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి ముందుగా పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనసేవ కార్యక్రమం చేపట్టి పట్టువస్త్రాలు, గరిక మాలతో అలంకరించారు. అనంతరం గణపతి అష్టోత్తరాన్ని జరిపించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు విశ్వనాథశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.





కర్నూలు నగరంలో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేంద్ర రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నంద్యాల, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు.

పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి





శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓఆర్డీ,రుద్రవరంలో సూచనలు ఇస్తున్న జబీబుల్లా

ఉయ్యాలవాడ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పొదుపు మహిళలు బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు పొంది సొంత వ్యాపారాలు నెలకొల్పుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ఉద్యోగులందరిపై ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణ, ఏపీఓ రవిప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రుద్రవరం:ఉద్యోగులు,ప్రజా ప్రతినిధులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి జబీబుల్లా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు స్థానిక సుస్థిరాభివృద్ధి అనే అంశంపై వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రెండో రోజు బుధవారం నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని పలు సూచనలు ఇచ్చారు.పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది,మండల స్థాయి అధికారులకు అభివృద్ధి లక్ష్యాలపై వివరించారు.

నంద్యాల(అర్బన్): ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది సమన్వయంతో పనిచేసి పల్లెలను ప్రగతి పథంలో నడిపించాలని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. గ్రామాల సుస్థిరాభివృద్ధి సాధన లక్ష్యాలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈఓఆర్డీ జ్యోతి, ఏఓ షాను పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక ఎంపీపీ సమావేశ భవనంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల ఎల్ఎస్‌డీజీఎస్ రెండో విడత శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న సచివాలయ సిబ్బందికి ధ్రువపత్రాలను ఎంపీడీఓ అందజేశారు. ఆయన మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్‌లు ఈఓఆర్డీ తాహీర్ హుసేన్, ఆరోగ్య విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరిస్తాం





రెవెన్యూ భూముల వివరాలను చదివి వినిపిస్తున్న డీటీ, ఉయ్యాలవాడలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

దొర్నిపాడు: గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరిస్తామని తహసీల్దార్ సుభద్ర తెలిపారు. బుధవారం మండలంలోని గుండుపాపల గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, మండల సర్వేయర్ నాగప్రసాద్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఈఓ చంద్రుడు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక గ్రామ సచివాలయంలో సర్పంచ్ మేకల ఓబులేస్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామంలో 1,046 మంది రైతులకు సంబంధించి 3,443 ఎకరాల విస్తీర్ణంలో భూముల రీ సర్వే చేయవలసి ఉందన్నారు. గ్రామ సభకు కేవలం 15 మంది రైతులు మాత్రమే రావడం సరికాదన్నారు. భూ సమస్యలున్నప్పటికీ ఎందుకు వినియోగించుకోవడం లేదన్నారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని పుసులూరు గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 8 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ప్రియదర్శిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదస్సుల్లో రైతుల భూములకు సంబంధించిన సమస్యలకు ఇక్కడిక్కడే పరిష్కారం చూపుతామన్నారు. గ్రామ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్లు రామచంద్రారావు, నాగరాజు, సర్పంచ్ సుబ్బయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రియదర్శిని

డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓలు గోపాలు, దాదాసాహెబ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేటలో వెలసిన శ్రీఆంజనేయస్వామి కోదండ రామాలయంలో బుధవారం రామాలయం ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ముందుగా నవగ్రహ హోమాలు, గణేష్ హోమాలు జరిపించి పూర్ణాహుతి గావించారు. అనంతరం పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి పూజలు చేసి, మహామంగళ హారతులు ఇచ్చారు. 41వ వార్డు కౌన్సిలర్ పున్నారాజేశ్వరి, మాజీ కౌన్సిలర్ పున్నాశేషయ్య, ఆలయ చైర్మన్ చెన్నా వెంకటేశ్వర్లు, ఈఓ వేణునాథరెడ్డి, ఆంజనేయశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప మాలధారులు




రుద్రవరంలో ర్యాలీగా వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

రుద్రవరం: స్థానిక పడమటి వీధిలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి 30 మంది అయ్యప్ప మాలధారులు బుధవారం ఇరుముడితో శబరిమలకు బయుదేరి వెళ్లారు. గ్రామానికి చెందిన యువకులు 41 రోజులు అయ్యప్ప దీక్ష బూనారు. నిత్యం నియమ నిష్టలతో అయ్యప్పకు పూజలు చేసేవారు. దీక్ష ముగియడంతో ఇరుముడి స్వీకరించి గ్రామంలో నుంచి శివారు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో శబరిమలకు బయలుదేరారు. అక్కడ స్వామి వారి సన్నిధిలో దీక్ష విరమిస్తామని మాలధారులు తెలిపారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం





పాల్గొన్న క్రైస్తవులు, ప్రసంగిస్తున్న సతీష్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ కళాశాల మైదానంలో బుధవారం రాత్రి కల్వరి మినిస్ట్రీస్, కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్, క్యాండిల్ లైట్ సర్వీసు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు బ్రదర్ సతీష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పశువుల పాకలో క్రీస్తు జననం, క్రిస్మస్ ట్రీ ప్రాధాన్యతను వివరిస్తూ స్టేజీ షో నిర్వహించారు. వేలాదిగా క్రైస్తవులు పాల్గొన్నారు. క్వయర్ గీతాలు, అలరించాయి. ఈ సందర్భంగా బ్రదర్ సతీష్‌కుమార్ దైవ సందేశం అందిస్తూ సకల మానవ పాప పరిహారార్థం క్రీస్తు మానవునిగా అవతరించారని చెప్పారు. ఆయన మానవాళికి చేసిన మేలును వివరించారు. ప్రతి ఒక్కరు భగవంతుడిపై విశ్వాసం, దయ, కరుణాగుణం కలిగి ఉండాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాల్గొన్న క్రైస్తవులందరికీ క్యాండిల్స్‌ను అందజేసి జ్యోతిని వెలిగించారు.

శిక్షణ వాయిదా వేయాలి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేసి వేసవిలో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివయ్య, రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ జనార్ధన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఒకే నెలలో నాలుగు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం మంచిది కాదన్నారు. ఒకే నెలలో ఫౌండేషనల్, లిటరసీ అండ్ న్యూమరసీ, లీడర్‌షిప్, గౌడ్స్ అండ్ స్కౌట్స్, జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశారన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండటం వల్ల ఒక్కో శిక్షణ కార్యక్రమానికి ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయులను పంపడంతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయలేకపోతున్నామన్నారు. ఎస్ఏ–1 పరీక్షలు, పేపర్ వాల్యూషన్, సిలబస్ పూర్తి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పరీక్షల కాలం పొంచిఉండటంతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకుండా శిక్షణ వాయిదా వేయాలని కోరారు. రాజ్‌కుమార్, దస్తగిరిబాషా, పుల్లయ్య, రాజేష్, మహమ్మద్ హనీఫ్, దీపక్ కుమార్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఏపీడీగా నిర్మల

కర్నూలు న్యూసిటీ: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఏపీడీగా నిర్మల నియమితులయ్యారు. నంద్యాల సీడీపీఓగా ఉన్న ఆమెకు పదోన్నతి కల్పించి జిల్లా ఏపీడీగా బదిలీ చేశారు. గతంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐసీడీఎస్‌కు ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టు ఉండేది. అయితే జిల్లాల విభజన తర్వాత ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టు నంద్యాల జిల్లాకు కేటాయించారు. జిల్లాకు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పోస్టును కేటాయించారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఏపీడీగా బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ ఉన్నారు. ఒకటి రెండు రోజుల్లో కొత్త ఏపీడీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



ఉప కారాగారంలో ఖైదీల భోజనాలను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి

ఆళ్లగడ్డ: ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలావెంకట శేషాద్రి అన్నారు. బుధవారం స్థానిక ఉప కారాగారాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఎప్పటినుంచి రిమాండ్‌లో ఉంటున్నారు అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. మీకు న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలుకు వచ్చిన వారు తమ ప్రవర్తన మార్చుకోవాలన్నారు. అలాగే ఆర్థిక స్తోమత లేని వారు దరఖాస్తు చేసుకుంటే ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం



హాజరైన భక్తులు

బేతంచెర్ల: స్థానిక నంద్యాల రహదారిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మార్గశిర మాసం పురస్కరించుకొని బుధవారం రాత్రి విశేష పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, ఋత్విగ్వరణం, రక్షాబంధన, కలశ స్థాపన, దీక్షా హోమం, గణపతి, నవగ్రహ, రుద్రహోమములు, మూల మంత్ర హోమం, పూర్ణాహుతితో పాటు భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి దేశ్పాండే గురుస్వామి, బ్రహ్మశ్రీ హరి నారాయణ గురుస్వామి మాలధారులు, భక్తజనసందోహం మధ్య ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, మూల విరాట్‌కు విశేష అలంకరణ చేసి, భజనలు, సంకీర్తనలతో విశేష పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు, భక్తులచే 'స్వామి యే అయ్యప్ప.. శరణం శరణం అయ్యప్ప' శరణుఘోషతో హరి హరసుతుడు శబరిమల నుంచి బేతంచెర్లకు వచ్చి భక్తుల మొర ఆలకిస్తున్నాడా అన్నట్లుగా ఆధ్యాత్మిక శోభ కనిపించింది. అయ్యప్ప సేవా సమితి సభ్యులు బచ్చు సుబ్రమణ్యం, మల్లు హుసేన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు భారతరత్న ఇవ్వాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్

నంద్యాల(వ్యవసాయం): అమరజీవి పొట్టి శ్రీరాములుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు గుడివాడ వేణుగోపాల్ కోరారు. బుధవారం నంద్యాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమరావతిలో 58 అడుగుల కాంస్య విగ్రహం పెట్టాలని, గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు పొట్టి శ్రీరాములు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా నామకరణం చేయాలని డిమాండ్ చేవారు. జిల్లా అధ్యక్షుడు షేగు ఉపేంద్ర, పాండురంగయ్య, సముద్రాల కుమార్ పాల్గొన్నారు.